www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily

Date of Publish : 12 August 2026, 7:53 am

Posted by : BHADRADRI NEWS

# నాలుగు షాపుల వేలంలో గందరగోళం




**రెండుసార్లు వేలం వేసి.. మళ్లీ వేలం ఎందుకు?**

**కార్పొరేషన్ తీరుపై అనుమానాలు..**

**సుజాతనగర్, ఆగస్టు 11 (తెలంగాణ వాణి)** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సుజాతనగర్‌లో ఉన్న నాలుగు దుకాణాల వేలంపాట వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఇప్పటికే రెండుసార్లు వేలం నిర్వహించి, షాపులు ఖరారు చేసిన అధికారులు తాజాగా మరోసారి వేలం నిర్వహించేందుకు సిద్ధమవుతుండటంతో అసలు కార్పొరేషన్‌లో ఏం జరుగుతోందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. మార్చి నెలలో కౌన్సిల్ తీర్మానం మేరకు తొలిసారి షాపుల వేలం నిర్వహించారు. ఆ వేలంలో పాల్గొన్న వారు అత్యధిక బిడ్‌లతో షాపులను దక్కించుకున్నారు. అనంతరం అద్దె తక్కువగా వచ్చిందనే కారణంతో ఏప్రిల్‌లో మళ్లీ వేలం నిర్వహించారు. ఈ రెండో వేలంలోనూ గతంలో విజేతలుగా నిలిచిన వారే నెలకు అదనంగా రూ.500 చొప్పున పెంచి మళ్లీ షాపులను దక్కించుకున్నారు. అనంతరం వారికి షాపుల కేటాయింపునకు సంబంధించిన నోటీసులు కూడా జారీ అయ్యాయి. అయితే, జూన్ నెలలో ఈ షాపుల అద్దె, కేటాయింపులకు సంబంధించిన ప్రతిపాదనను కౌన్సిల్ ఆమోదించింది. ఒకసారి కౌన్సిల్ ఆమోదం పొందిన తీర్మానాన్ని మళ్లీ ఆగస్టు నెల కౌన్సిల్ సమావేశంలో మరోసారి ప్రతిపాదనగా తీసుకురావడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికే కౌన్సిల్ ఆమోదం పొందిన అంశాన్ని తిరిగి సభ ముందుకు తీసుకురావడంలో ఆంతర్యమేంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఇదిలా ఉండగా, ఇప్పుడు మళ్లీ అదే షాపులకు మరోసారి వేలం నిర్వహిస్తామని అధికారులు చెబుతుండటంతో ఇప్పటికే షాపులు దక్కించుకున్న బిడ్డర్లలో తీవ్ర ఆందోళన నెలకొంది. రెండుసార్లు నిర్వహించిన వేలాల తర్వాత నోటీసులు జారీ చేసి, కౌన్సిల్ ఆమోదం కూడా పొందిన వ్యవహారాన్ని తిరిగి మొదటికి తీసుకురావడం వెనుక రాజకీయ ఒత్తిడిలు కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండుసార్లు నిర్వహించిన వేలాలను ఏ కారణంతో పక్కన పెట్టారు? ఇప్పటికే నోటీసులు అందుకున్న బిడ్డర్ల పరిస్థితి ఏమిటి? కౌన్సిల్ ఆమోదించిన తీర్మానాన్ని తిరిగి ఎందుకు తెరపైకి తెచ్చారు? దీని వెనుక రాజకీయ ఒత్తిడిలు పనిచేశాయా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై మున్సిపల్ అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాలని, ఇప్పటికే ఖరారైన వేలాలను రద్దు చేయాలనుకుంటే దానికి గల చట్టపరమైన కారణాలను ప్రజల ముందుంచాలని స్థానికులు, బిడ్డర్లు కోరుతున్నారు.

Copyright © 2026 BHADRADRI NEWS. All rights reserved.